ప్లేగుబంధం చార్మినార్

మహమ్మారి నివారణకు గుర్తుగా నిర్మించిన కుతుబ్‌షాహీలు

4 శతాబ్దాలుగా మత సామరస్యానికి ప్రతీకగా చారిత్రక కట్టడం

చార్మినార్‌ను రాజరికపు ఆనవాలుగా చూస్తున్న కాంగ్రెస్ సర్కారు

కళాతోరణం తీసేయడం సరికాదు

రాజముద్ర నుంచి కాకతీయుల కళాతోరణం తీసివేయాలనే ప్రభుత్వ నిర్ణయం సరికాదు. గొప్ప చరిత్ర ఉన్న చిహ్నం కళాతోరణం. ఒకప్పుడు వరంగల్ ప్రాంతాన్ని పాలించిన కాకతీయులు ఈ ప్రాంతం సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటును అందించించారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగించిన కాకతీయలకు గుర్తింపుగా కళాతోరణం నిలిచింది. కాకతీయుల పాలనావైభవాన్ని చాటిచెప్పే చిహ్నం. అంతేకాక సుమారు 200 ఏండ్లు పాలించిన కాకతీయులు నిర్మించిన గొలుసు కట్టు చెరువులు, చారిత్రక కట్టడాలు, దేవాలయాల ఘన చరిత్ర, పాలన వైభవం అంతా కళాతోరణంలో పూసగుచ్చినట్టుగా ఉన్నది. ఓరుగల్లు చారిత్రక ప్రాధాన్యానికి కళాతోరణం చిహ్నంగా నిలిచింది. కళాతోరణం తొలగింపుతో ఓరుగల్లుకు ఉన్న గొప్ప చారిత్రిక గుర్తింపు మాయం కావడంతోపాటు ప్రాధాన్యం తగ్గుతుంది. ఎంతో ఘన చరిత్ర ఉన్న కాకతీయ కళాతోరణాన్ని రాజముద్ర నుంచి తొలగించి ఏమి పెడతారు. ప్రభుత్వ నిర్ణయాలు ఎప్పుడూ ప్రజల ఆమోదయోగ్యంగానే ఉండాలి.

– అంపశయ్య నవీన్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మే 29 (నమస్తే తెలంగాణ): చార్మినార్.. హైదరాబాద్ అనగానే ప్రతి ఒక్కరికీ గుర్తొచ్చే పేరు ఇది. కులం, మతం, ప్రాంతం అనే భేదం లేకుండా ప్రతి ఒక్కరినీ ఆకర్షించే చారిత్రక కళా రూపం. ఇదేదో ఒక రాజ్యానికి ప్రతీకగా, ఒక రాజు కీర్తికి గుర్తుగా జరిగిన నిర్మాణం కాదు. ఎందరినో బలి తీసుకున్న ప్రాణాంతకమైన ప్లేగు మహమ్మారి అంతమైనందుకు గుర్తు. అంతటి సదుద్దేశం ఉన్నందునే కాబోలు నాలుగు శతాబ్దాలుపైగా చెక్కుచెదరకుండా ఆ కట్టడం నిలబడింది. హైదరాబాద్‌కే తలమానికం అది. దేశ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకుంటుంది. అందుకే కేసీఆర్ ప్రభుత్వం అనేకమంది చరిత్రకారుల అభిప్రాయాలను క్రోడీకరించి ఈ చారిత్రక కళారూపానికి రాష్ట్ర అధికారిక చిహ్నంలో స్థానం కల్పించారు. కానీ రేవంత్ ప్రభుత్వం చార్మినార్‌ను రాజరికపు ఆనవాలుగా చూడటం అందరినీ ఆవేదనకు గురి చేస్తున్నది. ఏ ప్రభుత్వమైనా అరుదైన వారసత్వ కట్టడాలకు అంతర్జాతీయ గుర్తింపు రావాలని కోరుకుంటుంది. అయితే, ఇక్కడ ప్రతికూల దృక్పథంతో చారిత్రక నిర్మాణంపై రాజరికపు ముద్ర వేయడం దురదృష్టకరమని చరిత్రకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్ గ్లోబల్ ఐకాన్

ప్రపంచంలోని అరుదైన వారసత్వ కట్టడాల్లో ప్రత్యేక స్థానం సాధించుకున్న చార్మినార్ మరోసారి చర్చనీయాంశంగా మారింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అధికారిక చిహ్నంలో చోటు సాధించినపుడు విస్తృతస్థాయిలో చర్చ జరిగింది. ఆపై తాజాగా రేవంత్ ప్రభుత్వం చార్మినార్‌పై రాజరికపు ఆనవాళ్ల ముద్ర వేసిన ఈ సందర్భంలోనూ మరోసారి చర్చకు దారి తీస్తున్నది. నాలుగు మినార్ల (స్తంభాలు)తో హైదరాబాద్ గ్లోబల్ ఐకాన్‌గా అవతరించిన ఈ చారిత్రక నిర్మాణం 433 ఏండ్ల కిందట అంటే 1591లో రూపుదిద్దుకున్నది. చార్మినార్ కమాన్, కాలీ కమాన్, మచిలీ కమాన్, షేర్ ఏ బాతుల్ పేరిట 60 అడుగుల ఎత్తు, 30 అడుగుల వెడల్పుతో ఇండో-పర్షియన్ పద్ధతిలో ఈ కమాన్‌ల నిర్మాణం జరిగింది. అందుకే సర్వే ఆఫ్ ఇండియా రూపొందించిన అధికారిక కట్టడాల జాబితాలో పురావస్తు, నిర్మాణనిధిగా చార్మినార్‌ను చేర్చారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ప్రాణాలను బలి తీసుకున్న ప్రాణాంతకమైన ప్లేగు వ్యాధిపై సాధించిన విజయానికి, గోల్కొండ నుంచి ప్రస్తుత హైదరాబాద్ నగరానికి రాజధాని మార్చిన సందర్భంలో మహమ్మద్ ఖులీ కుతుబ్‌షా చార్మినార్‌ను నిర్మించారు.

మతసామరస్యానికి ప్రతీక

వినూత్న నిర్మాణ శైలి, చెక్కు చెదరని వారసత్వ సంపదకు చిహ్నంగా ఉన్న చార్మినార్‌కు, హైదరాబాద్ నగరానికి విడదీయలేని బంధం ఉన్నది. ఆర్కియాలజీ పరిశోధనల్లో చార్మినార్ నిర్మాణశైలి ఇప్పటికీ ఒక వింతైన కట్టడంగానే నిలుస్తున్నది. ఓవైపు మక్కామసీదు, మరోవైపు భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయంతో కూడిన ఈ చార్మినార్ ప్రాంగణం మత సామరస్యాన్ని పెంపొందించే వేదిక. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఈ వారసత్వ నిర్మాణం దెబ్బతినకుండా అనేక చర్యలు తీసుకున్నారు. వాహన కాలుష్యం బారిన పడకుండా చుట్టూ పాదచారుల వంతెన నిర్మించారు. స్వరాష్ట్రంలో చారిత్రక వారసత్వ సంపదకు జీవంపోసేలా చార్మినార్ సమీపంలో చేపట్టిన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో ఆ కట్టడం మరింత శోభాయమానంగా వెలుగుతున్నది. తెలంగాణ సాధన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం చరిత్రకారులతో విస్తృతంగా చేపట్టిన చర్చల్లో భాగంగానే అధికారిక చిహ్నంలో చార్మినార్‌ను చేర్చారు. దీనికి తెలంగాణవ్యాప్తంగా ప్రజల ఆమోదం కూడా లభించింది. కానీ రేవంత్ ప్రభుత్వం మాత్రం రాజకీయ కోణంలో కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేసే కుట్రలో భాగంగా చరిత్రను చెరిపేసేందుకు ప్రయత్నిస్తుండటం చరిత్రకారులను ఆందోళనకు గురిచేస్తున్నది. చారిత్రక, వారసత్వ కట్టడాలకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చేందుకు కృషిచేయాల్సిన ప్రభుత్వమే.. రాజరికపు ముద్ర అని నెగెటివ్ ముద్ర వేయటం చరిత్రను వక్రీకరించే దుస్సాహసమేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఈ నగరాన్ని నింపు దేవుడా!

చార్మినార్‌కు పునాది వేసినపుడు కుతుబ్‌షా దఖనీ కూట్స్‌లో ప్రార్థనలు నిర్వహిస్తూ 'నదిలో చేపలని ఎలా నింపావో ఈ నగరాన్ని కూడా ప్రజలతో నింపు దేవుడా' అని ప్రార్థించారు. కాల మహిమో, ప్రాంత మహిమోగానీ ఆ రోజు నుంచి ఈనాటి వరకు చార్మినార్ చుట్టూ హైదరాబాద్ దినదిన ప్రవర్ధమానంగా విస్తరిస్తూ విశ్వనగరంగా ఎదిగింది. ఈ కట్టడాన్ని నాడు హిందూ, మొఘల్ వాస్తు శిల్పాల కలయికతో నిర్మించారు. నలుదిశలా కనిపించేలా ఉండే చార్మినార్ గోడలకు అమర్చిన గడియారాలను 1859లో లండన్ నుంచి దిగుమతి చేసుకున్నారు. ఇప్పటికీ అవి పనిచేస్తున్నాయి.



ఢిల్లీపై ధిక్కారానికి ప్రతీక కళాతోరణం

- **1303లో ఖిల్జీ సేనలను ఓడించిన కాకతీయులు**
- **అప్పటి విజయానికి గుర్తుగా కాకతీయ కళాతోరణం ఏర్పాటు**
- **రాజముద్ర నుంచి దానిని సర్కారు తొలగించడంపై ఆందోళన**

వరంగల్, మే 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాకతీయుల కళాతోరణం.. చెరువు, పట్టణం, ఆలయం స్ఫూర్తితో ప్రజలు కేంద్రంగా పరిపాలన సాగించిన కాకతీయుల స్ఫూర్తి చిహ్నం. కళాతోరణం అంటే రాతి కట్టడమేనని అనుకుంటున్నారు సర్కారు పెద్దలు. అధికార బలంతో ఎదురు లేదని విర్రవీగిన ఢిల్లీ పాలకులను ఎదిరించి నిలిచిన తెలంగాణ వీరత్వానికి గుర్తు కళాతోరణం. ఢిల్లీ సుల్తానుల దండయాత్రను ఎదురొడ్డి పోరాడిన సామాన్య ప్రజల విజయగాథలకు చిహ్నంగా కళాతోరణం నిలిచింది. తెలంగాణ ప్రజల సంస్కృతి, వారసత్వ సంపదకు చిహ్నంగా నిలిచిన కాకతీయ కళాతోరణాన్ని ఢిల్లీ పెత్తనంలో రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచితంగా రాజముద్ర నుంచి తొలగిస్తున్నది. 700 ఏండ్ల కిందట ఢిల్లీ సుల్తానుల దండయాత్రను ఎదురించిన స్ఫూర్తితోనే ఇప్పుడు కళాతోరణాన్ని పరిరక్షించుకొనే తరుణం వచ్చింది.

అప్పటి స్ఫూర్తితో..

ఢిల్లీ సుల్తాను జలాలుద్దీన్ ఖిల్జీ అధికార కాంక్షతో దక్షిణ భారతదేశంపై దండయాత్రలు మొదలుపెట్టారు. ఆయన సేనలు 1295లో యాదవ రాజ్యకేంద్రమైన దేవగిరిని దోచుకొనిపోయారు. అనంతరం జలాలుద్దీన్‌ను హత్యచేసి సుల్తాన్ అయిన అల్లావుద్దీన్ ఖిల్జీ దక్షిణ భారతదేశంపై దాడులను తీవ్రం చేశాడు. దేవగిరి రాజు యాదవచంద్రుడు మొదటి యుద్ధంలోనే ఖిల్జీతో సంధి చేసుకున్నాడు. ఈ విజయంతో మాలిక్ ఫక్రుద్దీన్, జునాఖాన్ నాయకత్వంలో ఖిల్జీ సేనలు దక్షిణ భారతదేశంలోనే సంపన్నమైన కాకతీయ రాజ్యంపై 1303లో ఓరుగల్లు వైపు దండయాత్రకు వచ్చాయి. కాకతీయ సేనానులు పోతుగంటి మైలి, రేచర్ల వెన్న భూపాలుడు నాయకత్వంలో కాకతీయ సైనికులు ఢిల్లీ సుల్తానుల సైన్యాన్ని అడ్డుకున్నారు. వీరోచితంగా పోరాడి ఖిల్జీ సేనలను వెనక్కి తరిమారు. ప్రస్తుత కరీంనగర్ జిల్లా ఉప్పరపల్లి, సైదాపూర్ మండలం గొడిశాల నుంచి ఖిల్జీ సేనలు ఓటమితో తిరుగుముఖం పట్టాయి. ప్రజల అండదండలతో ఢిల్లీ సుల్తానులపై కాకతీయ సేనలు చేసిన ఈ యుద్ధం గురించి గొడిశాలలో కాకతీయుల కళాతోరణం ఉన్నది.

పక్కదారి పట్టించే పనులు

కాకతీయ శిల్పుల కీర్తి కిరీటంలో కళాతోరణం ఒక కలికితురాయి. దానిపై కాకతీయుల పాలనా వైభవమంతా పూసగుచ్చినట్టుగా ఉంటుంది. ఎలాంటి సాంకేతిక, యంత్ర పరికరాలు లేకుండా వందల ఏండ్ల కింద చెక్కిన తోరణాలు గొప్ప వారసత్వ సంపద. తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా ఓరుగల్లు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, అస్థిత్వ చిహ్నంగా ఉన్న కళాతోరణాన్ని రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం నుంచి తొలగించాలన్న కాంగ్రెస్ సర్కారు సాంస్కృతిక, వారసత్వ సంపదపై దాడిగానే చూస్తామని స్పష్టం చేస్తున్నారు. చరిత్రలో రాజధానులు, వాటి పేర్లు, నాణేలను మార్చిన రాజులు ఇప్పటికీ చరిత్రహీనులుగానే ఉన్నారని, కాంగ్రెస్ సర్కారు చర్యలు అదే కోవలోకి వస్తాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ చారిత్రక వారసత్వం, సంస్కృతిపై దాడి

కాంగ్రెస్ సర్కారు చర్యలు తెలంగాణ చారిత్రక వారసత్వం, సంస్కృతిపై దాడి చేస్తున్న పరిస్థితి కనిపిస్తున్నది. తెలంగాణ రాజముద్రలో పెట్టుకున్న కాకతీయ కళాతోరణం ప్రజలు కేంద్రంగా సాగిన పాలనకు గుర్తింపు. ఇలాంటి స్ఫూర్తి కలిగిన కాకతీయ కళాతోరణాన్ని ఢిల్లీ చెప్పుచేతుల్లో ఉండే రేవంత్ సర్కారు తొలగిస్తున్నది. ఇప్పుడు ఆ సర్కారుపై పోరాడాల్సిన పరిస్థితి వచ్చిందని తెలంగాణ సమాజం గొంతెత్తుతున్నది. కళాతోరణాన్ని తొలగించే నిర్ణయం ఎంతమాత్రం అంగీకారం కాదని యావత్తు తెలంగాణ ప్రజలు, మేధావులు, చరిత్రకారులు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. ప్రజల మనసు ఎరుగని కాంగ్రెస్ సర్కారు మొండిగా ముందుకుపోతున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కవులు, కళాకారులు, విద్యార్థులు, పరిశోధకులు, మహిళలు ప్రతి ఒక్కరు ఇదే మాట చెప్తున్నారు.

మార్చాలనుకోవడమే లక్ష్యమైతే మార్చడం తప్పే

- **అధికారిక చిహ్నంలో లోపాలుంటే చర్చకు పెట్టాలి**
- **రాష్ట్ర గీతానికి కీరవాణి కంపోజింగ్ అభ్యంతరమే**
- **కవి, రచయిత వారాల ఆనంద్**

కరీంనగర్, మే 29 (నమస్తే తెలంగాణ):'ఇపుడున్న రాష్ట్ర అధికారిక చిహ్నంలో నాకు తెలిసి ఎలాంటి లోపాలు లేవు. ఒక మతానికి, కులానికి, వర్గానికి సంబంధం లేకుండా ఉన్నది. ఇలాంటి చిహ్నాన్ని మార్చడం సమంజసంగా లేదు. మార్చాలనుకోవడమే లక్ష్యమైతే మార్చడం తప్పని నేను భావిస్తున్న. రాష్ట్ర గీతాన్ని తెలంగాణ భావాలకు, సంస్కృతికి సంబంధం లేని వ్యక్తి కీరవాణితో కంపోజ్ చేయించడంపై తీవ్రంగా అభ్యంతరం తెలుపుతున్న' అని ప్రముఖ కవి, రచయిత వారాల ఆనంద్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికార చిహ్నంలోని కాకతీయ తోరణం, చార్మినార్‌ను తొలగించాలని నిర్ణయించిన నేపథ్యంలో ఆయన స్పందించారు. 'అధికారిక చిహ్నంలో మార్పులు చేయడం సరికాదు. తెలంగాణకు, తెలంగాణభావానికి సంబంధం లేని వ్యక్తితో తెలంగాణ గీతాన్ని కంపోజ్ చేయించడం సరైన నిర్ణయం కాదు. ఇప్పటి వరకు ఉన్న చిహ్నంలో ఏవైనా లోపాలు ఉంటే తెలంగాణ సమాజంలో చర్చకు పెట్టాలి. కానీ, మార్చాలని మారుస్తామంటే సరైంది కాదు. ఏ రాష్ట్ర చిహ్నంలోనైనా, దేశ చిహ్నంలోనైనా చారిత్రక, సాంస్కృతిక నేపథ్యం ఉంటుంది. దానిని మనం గౌరవించాలి. మన జాతీయ గీతాన్ని రవీంద్రనాథ్‌ఠాగూర్ రాశారు. అప్పుడు ఈ గీతంపై అనేక ఆరోపణలు ఉండేవి. అయినా దానిని భారత సమాజం ఆమోదించింది. నెహ్రూ నుంచి మోదీ వరకు ఎవరూ మార్చాలని చూడటం లేదు. ఇప్పుడు అధికారంలో ఉన్నామని, మార్చాలని మార్చుకుంటే పోతే రేపు మరొకరు అధికారంలోకి వచ్చి వారికి అనుకూలంగా మార్చుకుంటూ పోతే అర్థం ఉంటుందా..? మనకు ఎప్పటికైనా శాశ్వత చిహ్నం అనేది ఉండాలి కదా..! కాకతీయ తోరణం మార్చాలనుకుంటున్నారని తెలుస్తున్నది. వాళ్లు మన వాళ్లు కాదా..? కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జాతీయ గీతాన్ని మారుస్తరా..? ఆలోచించుకోవాలి.. కీరవాణికి రాష్ట్ర గీతానికి బాణీలు కట్టే పని అప్పగించడంలో కూడా నాకు అభ్యంతరం ఉన్నది. ఈ విషయంలో నిర్ణయం ఎవరిదని అడిగితే సీఎం అని అందెశ్రీ, అందెశ్రీదేనని సీఎం చెప్పుకుంటున్నారు. అందెశ్రీ గొప్ప కవి అందులో ఏ సందేహం లేదు. కానీ, రాష్ట్ర గీతం విషయంలో ఆయనపై జరుగుతున్న చర్చ ఆరోగ్యకరంగా లేదు. అధికారిక చిహ్నంలో ఎలాంటి లోపాలు ఉన్నాయో చర్చకు పెట్టిన తర్వాతనే మార్పులు చేయాలి. కాకతీయులు మనల్ని పాలించారు. ఇది చారిత్రక సత్యం. ఇపుడున్న చిహ్నం మార్చితే చరిత్రను మార్చలేం కదా..' అని ఆనంద్ పేర్కొన్నారు.

రాచరికమని చరిత్రనే తిరగరాస్తారా..?

తెలంగాణ రాజముద్రలో రాజవంశాల గుర్తులని, కాకతీయ తోరణ ద్వారాన్ని, చార్మినార్‌ను తొలగించడం అనుచితం. వాటిమీద ఆయా రాజవంశాల చిహ్నాలేమీ ఉండవు. కానీ, ఆనాటి శిల్పశైలి ఉంటుంది. అదొక సాంస్కృతిక పరంపర. కాకతీయుల చెరువులు గొప్పవే. రామప్ప గొప్పదే. రాణీరుద్రమ గొప్పదే. అయితే రాచరికమని చరిత్రనే తిరగరాస్తారా..? చార్మినార్ రాజవంశానిది కాదు. మత చిహ్నం కాదు. అదొక సాంస్కృతిక నమూనా. వీటికన్నా గొప్పగా తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే ప్రత్యమ్నాయ చిహ్నాలు ఏమున్నాయో మరి. వీటికి కలిగిన ప్రాచుర్యం వల్ల తెలంగాణ ప్రజలు వాటిని తమ సొంతం చేసుకున్నారు. వీటిని తొలగించి వేటిని చేరుస్తారు? ఏ రాజవంశాలకు చెందని రాతి చిత్రాలనా? వీరగల్లులనా..? క్రీడలనా..పక్షులనా...? తెలంగాణ సాయుధ పోరాట యోధులనా? తెలంగాణ ఉద్యమకారుల ఫొటోలనా? ఎవరివని? ప్రజాభిప్రాయం తీసుకోకుండా ఇష్టాపూర్తిగా రాజముద్రలంటే అవి కూడా రాజరికపు చిహ్నాలుగానే మిగిలిపోవా? కొత్త రాజముద్ర ఎట్ల ఉండబోతుందనే కుతూహలం ప్రజల్లో పెరిగిపోయింది. అవి ప్రజలకు ఆమోదయోగ్యంగా లేకపోతే ఏం చేస్తారు రూపకర్తలు. ప్రజలకు నచ్చేవి చేస్తేనే ప్రభుత్వానికి గౌరవం పెరుగుతుంది. ప్రస్తుతమున్న రాజముద్రలో రాచరికపు ఆనవాళ్లు ఉన్నాయని చెప్పడం సరికాదు. ఇప్పుడున్న లోగోలో కాకతీయ కళాతోరణం అద్భుతంగా కనిపిస్తున్నది. దీని ద్వారా కాకతీయ రాజులు తమ రాజ్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు వ్యవసాయరంగ అభివృద్ధి కోసం విస్తృతంగా తవ్వించిన చెరువుల చరిత్ర భవిష్యత్ తరాలు తెలుసుకోవడానికి దోహదపడుతుంది. అటు రాచరికపు వ్యవస్థలోనూ ఇప్పటి ప్రజాస్వామ్య వ్యవస్థలోనూ తప్పొప్పులు జరుగుతూనే ఉంటాయి. మంచిని స్వీకరించి రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండాలి.

-శ్రీరామోజు హరగోపాల్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్

ప్రజల్లో అసహనాన్ని రేకెత్తించడమే..

అనేక పోరాటాలు చేసి సాధించుకున్న రాష్ట్రం మన తెలంగాణ. తొలి సీఎంగా కేసీఆర్ పదేండ్ల పాలనలో ఎన్నో ప్రతిష్టాత్మక కార్యక్రమాలు చేపట్టారు. బతుకమ్మ, బోనాలు వంటి పండుగలను రాష్ట్ర పండుగలుగా, జమ్మిచెట్టును రాష్ట్ర వృక్షంగా, పాలపిట్టను రాష్ట్ర పక్షిగా గుర్తించారు. తెలంగాణ రాజముద్రను రూపొందించారు. కాకతీయుల కళాతోరణం, చార్మినార్ వంటి అంశాల మేళవింపుగా అంతర్జాతీయ చిత్రకారుడు ఏలె లక్ష్మణ్ రూపొందించిన లోగోను తెలంగాణ రాష్ట్ర చిహ్నంగా నిర్ణయించారు. ప్రస్తుత సీఎం ఉన్న రేవంత్‌రెడ్డి టీఎస్‌ను టీజీగా మార్చ డం, రాష్ట్ర చిహ్నంలో మార్పులు చేయడం వంటివి ప్రజ ల్లో కొంత అసహనాన్ని, అశాంతిని రేకెత్తించేలా ఉన్నాయి.

- అంబటి వెంకన్న, ప్రముఖ గాయకుడు, నల్లగొండ

ప్రాంతీయులకే ప్రాధాన్యమివ్వాలి..

తెలంగాణ ఉద్యమానికి ఒక ప్రత్యేక చరిత్ర, సందర్భమూ ఉన్నది. ఆంధ్రా పెత్తందారుల నుంచి విముక్తి కోసమే ప్రత్యేక తెలంగాణ సాధించుకున్నాం. తెలంగాణ ఉద్యమ చరిత్రలో 'జయ జయహే తెలంగాణ' పాటకు ఓ ప్రత్యేక స్థానం ఉన్నది. ఉద్యమ సమయంలో ఎందరిలోనో స్ఫూర్తి నింపింది. తెలంగాణ అధికార చిహ్నంలో చార్మినార్, కాకతీయ కళాతోరణం తొలగించడం సముచితం కాదు.

- జక్కెపల్లి నాగేశ్వర్‌రావు, సంగీత విద్వాంసుడు, చెన్నూర్, మంచిర్యాల జిల్లా

చరిత్రను కాలరాయడం ఎవరితరమూ కాదు

అలనాటి కీర్తి తోరణాలు, శాసనాలు, ప్రాచీన కట్టడాలు మన సంస్కృతి, వారసత్వానికి ప్రతీకలుగా ఉంటాయి. రాష్ట్ర గీతం నుంచి కళాతోరణాన్ని తొలగించవచ్చేమో కానీ తెలంగాణ ప్రజల హృదయం నుంచి తీసివేయలేము. మన చారిత్రక వారసత్వ సంపదను కాపాడడం, భవిష్యత్ తరాలకు అందించడం మన బాధ్యత. ఈ విషయంలో తొందరపడక ఒకసారి పునఃఆలోచించడం శ్రేయస్కరం. చరిత్రను కాలరాయడం ఎవరి తరమూ కాదు.

-టంగుటూరి సైదులు, సాహిత్య పరిశోధకుడు, చందుపట్ల, నకిరేకల్ మండలం, నల్లగొండ జిల్లా

దశాబ్ది వేడుకలు జరిపే అర్హత రేవంత్‌కు లేదు

- **రేవంత్‌రెడ్డి ఎన్నడూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొనలేదు**
- **ఉద్యమకారులను అవమానిస్తూ.. ద్రోహులను గౌరవిస్తున్నారు**
- **సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి విమర్శ**

ఖైరతాబాద్, మే 29: జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుతామనంటున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఆ నైతిక అర్హత లేదని సీనియర్ జర్నలిస్టు పాశంయాదగిరి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ఎన్నడూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొనలేదని చెప్పారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకోసం ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీ బిల్లు పెడితే, తెలంగాణ కోసం నాటి కాంగ్రెస్ నేతలు ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్, చిన్నారెడ్డి తదితరులు పోరాడారని గుర్తుచేశారు. తెలంగాణ ఆవిర్భావవేడుకలు నిర్వహించే నైతిక అర్హత కూడా వారికున్నదని అన్నారు. రెండు కండ్ల సిద్ధాంతాన్ని నమ్మే మాజీ సీఎం చంద్రబాబుకు సహచరుడినని చెప్పుకునే రేవంత్‌రెడ్డి ఎన్నడూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొనలేదని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డికి ఉద్యమకారుల త్యాగాలు, రాష్ట్రావిర్భావ విలువలు తెలియవని అన్నారు. నేటి కాంగ్రెస్ సర్కారు హయాంలో తెలంగాణ కోసం పోరాడిన వారిని అవమానిస్తున్నారని, ద్రోహం చేసిన వారిని సన్మానిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ స్తూపం కట్టిన ఎక్కా యాదగిరి, సికింద్రాబాద్‌లోని క్లాక్ టవర్ వద్ద అమరుల స్తూపం కట్టిన సింహా పరిస్థితి దారుణంగా ఉన్నదని, అలాంటి వారిని సన్మానించుకోవాలని చెప్పారు. అందెశ్రీ రాసిన తెలంగాణ రాష్ట్ర గీతానికి ఆంధ్రా సంగీత దర్శకుడిని పెడుతున్నారని, ఉద్యమ ద్రోహులందరికీ టికెట్లు ఇచ్చారని, లోగోను మార్చాలనుకుంటే.. చాకలి ఐలమ్మ బొమ్మ పెట్టాలని సూచించారు. ఓ కమిటీ వేయకుండా ఏకపక్ష నిర్ణయాలు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులకు మేలు చేయాలన్న చిత్తశుద్ధి ఉంటే ముందుగా వారిపై ఉన్న కేసులన్నింటినీ ఎత్తివేయాలని, అందుకు ఓ కమిటీ వేయాలని సూచించారు.

1969 ఉద్యమ కుటుంబాలను ఆదుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యమ జేఏసీ విజ్ఞప్తి

కాచిగూడ, మే 29: 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని 1969 తెలంగాణ విద్యార్థి ఉద్యమ జేఏసీ కన్వీనర్ ఎస్ గోపాల్‌రావు కోరారు. బుధవారం నింబోలిఅడ్డాలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయని వాపోయారు. పోలీసుల లాఠీదెబ్బలు, తుపాకీగుండ్లకు అనేక మంది దివ్యాంగులయ్యారని, వివిధ కేసుల్లో జైలుపాలై చాలా మంది దీనస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థి కుటుంబాలు తమ సమస్యలను చెప్పుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి వారికి అపాయింట్‌మెంట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

చారిత్రక ఆనవాళ్లను చెరిపేయొద్దు

రాజముద్ర వెనుక చరిత్రకారుల మేధోమథనం ● ఇన్‌టాక్ కో కన్వీనర్ అనురాధారెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాజముద్ర రూపకల్పనలో చరిత్రకారుల మేధోమథనం ఉన్నదని ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇన్‌టాక్) కో కన్వీనర్ అనురాధారెడ్డి వివరించారు. రాష్ట్ర అధికారిక చిహ్నంలో మార్పుల విషయంపై ఆమె స్పందిస్తూ 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. సుదీర్ఘ చర్చలు, అంతకుమించిన వారసత్వ నేపథ్య మూలాలు, సాంస్కృతిక వైభవాన్ని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఉర్దూ యూనివర్సిటీ, ఉస్మానియా వర్సిటీ, చరిత్రకారుల బృందం కలిసి ఎన్నో సలహాలు, సూచనలు తీసుకొని రాజచిహ్నాన్ని తయారు చేశారని, అలా రూపొందించినదాన్నే ఇన్నాళ్లూ అధికారికంగా వినియోగించామని వెల్లడించారు. కాకతీయ తోరణం, చార్మినార్ అనేవి రాచరిక, మతపరమైన అంశాలు కానే కావని, వాటి నేపథ్యం వేరే ఉన్నదని చెప్పారు. తెలంగాణ ప్రాంతాన్ని పాలించిన కాకతీయుల వీరత్వం, ఇక్కడి కళలు, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కళాతోరణం, రామప్ప ఆలయాన్ని నిర్మించారని, చారిత్రక చార్మినార్ మతపర కట్టడం కాదని, దానికి దక్కన్ వారసత్వ మూలాలున్నాయన్నారు. ఎంతో మందిని బలిగొన్న ప్లేగు వ్యాధిపై సాధించిన విజయానికి ప్రతీకగా చార్మినార్‌ను జ్యామితీయ విధానంలో నిర్మించారని వివరించారు. సాంస్కృతిక, వారసత్వ, చారిత్రక అంశాలపై నిర్ణయం తీసుకునేటప్పుడు చరిత్రకారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. నిజానికి రాజముద్రలో మార్పు అంటే అస్తిత్వాన్ని చాటే చారిత్రక ఆనవాళ్లను చెరిపివేసేలా ఉండకూడదని చెప్పారు.

చారిత్రక గీతాన్ని.. చారిత్రక తప్పిదంగా చేయొద్దు

- **ఇక్కడి కళాకారుల ఆత్మ ఘోషిస్తుంది**
- **స్వరాష్ట్రంలో చిన్నచూపు ఎందుకు?**
- **ఇక్కడి మట్టిబిడ్డలకు అర్హత లేదా?**
- **సినీ దర్శకుడు, తెలంగాణ సినీ కార్మిక సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్ ఇనుముల**

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర గీతంపై వివాదం రోజురోజుకూ చ